విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
సోమవారం 2 మార్చి 2026

# కూటమి ప్రభుత్వం మెడలు వంచుదాం

- నీటి కోసం పోరాడకుంటే భవిష్యత్ తరాలకు నష్టం
- గ్రేటర్ రాయలసీమ వాసులుగా ముందుకు కదులుదాం
- ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచుతున్నా పట్టించుకోని సీఎం చంద్రబాబు
- రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ పనులు తక్షణం ప్రారంభించాలి
- హంద్రీనీవా సామర్థ్యాన్ని 11500 క్యూసెక్కులకు పెంచాలి
- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్
- కడపలో 'రాయలసీమ లిఫ్ట్'పై భవిష్యత్ కార్యాచరణ సమావేశం




అనంతపురం, మార్చి 1 (అనంత ప్రభ)

రాయలసీమ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వం మెడలు వంచేలా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు రాయలసీమ ఎత్తిపోతల పథకం ఓ వరమని అన్నారు. నీటి కోసం ఇప్పుడు పోరాడకపోతే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోతాయని తెలిపారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం కడపలోని మేడా కన్వెన్షన్ హాల్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అధ్యక్షులు, వైసీపీ సమన్వయకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను ప్రజా ఉద్యమంగా మార్చాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమ రూపకల్పనపై చర్చించారు. కృష్ణా జలాల పరివాహక ప్రాంతానికి చంద్రబాబు చేస్తున్న ద్రోహాన్ని కలిసికట్టుగా తిప్పికొడదామని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం దశాబ్ధాలుగా సాగు, తాగునీటి కష్టాలు ఎదుర్కొంటోందన్నారు. ఇక్కడ వలసలు, రైతుల ఆత్మహత్యలు ఆపడం కోసం ఎంతో మంది పోరాటాలు చేశారని గుర్తు చేశారు. దాని ఫలితంగానే నాగార్జున సాగర్, శ్రీశైలం, ఎస్ఆర్‌బీసీ, తెలుగు గంగ, హెచ్ఎన్ఎస్ఎస్, జీఎన్ఎస్ఎస్ వంటి ప్రాజెక్టులు వచ్చాయని తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాలు అక్రమంగా ప్రాజెక్టులు కడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచి 129 టీఎంసీల సామర్థ్యాన్ని ఏకంగా 229 టీఎంసీలకు పెంచుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి రోజుకు 8 టీఎంసీలు తీసుకెళ్తోందన్నారు. ఇలాంటి తరుణంలో పోరాడాల్సిన ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. చంద్రబాబుకు రాష్ట్ర ప్రయోజనాల కన్నా వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలే ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఇలాంటి తరుణంలో ప్రజలే పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పీసీపీ అధ్యక్షుడిగా ఉంటూనే పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుడితే చంద్రబాబు సీఎం అయ్యాక ఈ పథకానికి సమాధి కడుతున్నారని మండిపడ్డారు. శ్రీశైలం నుంచి రోజుకు 3 టీఎంసీలు చొప్పున తీసుకెళ్లేలా రాయలసీమ లిఫ్ట్‌ను రూపొందించినట్లు తెలిపారు. 2024 వరకు రాయలసీమ లిఫ్ట్ పనులు కొనసాగాయని, చంద్రబాబు సీఎం అయ్యాక పనులు ముందుకు సాగలేదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి చేయడంతో ఎన్జీటీ అనుమతి వచ్చిన తర్వాత పనులు చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు శాసనమండలిలో ఇటీవల ప్రకటన చేశారన్నారు. ఎన్జీటీ అనుమతితోనే కర్ణాటకలో ఆల్మట్టి, తెలంగాణలో ప్రాజెక్టులు కట్టడం లేదని అనంత వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు. 2022లో ఎన్జీటీ అభ్యంతరాలు చెప్పినా రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ పనులు ఆపలేదన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు పునఃప్రారంభించి ఎన్జీటీ అనుమతులు తీసుకురావాలన్నారు.

హంద్రీనీవా సామర్థ్యం 11,500 క్యూసెక్కులకు పెంచాలి

హంద్రీనీవా సుజల ప్రవంతి పథకం కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాలకు కీలకమని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 11500 క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 3850 క్యూసెక్కుల సామర్థ్యం మాత్రమే ఉండడంతో ఒక టీఎంసీ డ్రా చేయడానికి నాలుగు రోజులు పడుతోందని చెప్పారు. శ్రీశైలానికి వరద నీరు 40 రోజులు మాత్రమే వస్తున్న నేపథ్యంలో ఆ 40 రోజుల్లో 40 టీఎంసీలు తీసుకెళ్లాలంటే హంద్రీనీవా సామర్థ్యం 11500 క్యూసెక్కులకు పెంచాలన్నారు. అప్పుడే రాయలసీమకు ప్రయోజనం కలుగుతుందని తెలియజేశారు. గ్రేటర్ రాయలసీమకు సాగు, తాగునీటి కోసం పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందని, గ్రామగ్రామాన ప్రజలను చైతన్యవంతులను చేసి కూటమి ప్రభుత్వం మెడలు వంచుదామని పిలుపునిచ్చారు

## ఈ నెల 2న కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



పుట్టపర్తి, మార్చి 1 (అనంత ప్రభ)

ఈ నెల 2న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

లిఅర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా "mee-kosam.ap.gov.in" లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు.

ఈనెల 2న జిల్లాలోని కలెక్టరేట్‌లో "రెవెన్యూ క్లినిక్స్" ఏర్పాటు

జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

ఈనెల 2న సోమవారం జిల్లా నందలి కలెక్టరేట్‌లో "రెవెన్యూ క్లినిక్స్" కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించి, భూమి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ శనివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

జిల్లాలోని పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం, కదిరి మరియు మడకశిర డివిజన్లకు చెందిన అధికారులు కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తారు. ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులను స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కరించేలా ఈ కార్యక్రమం చేపట్టబడుతుంది."

ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమంలో అడంగల్ లో మార్పులు చేర్పులు, మ్యుటేషన్స్, పట్టాదార్ పేరు మార్పులు, అసైన్మెంట్ పట్టా, ఎఫ్లైన్, జాయింట్ ఎల్పీఎం సబ్ డివిజన్, 22 ఏ చుక్కల భూములు, రస్తా, స్మశాన వాటికల సమస్యలు, అలాగే వివిధ భూ వివాదాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్ రికార్డుల సవరణ, వారసత్వ నమోదు, ఆక్రమణలపై ఫిర్యాదులు తదితర అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలనే దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు

# అంగన్వాడీల డిమాండ్లను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది

- 2సార్లు వేతనాలు పెంచింది తెలుగుదేశం ప్రభుత్వమే
- అంగన్వాడీలకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన
- జగన్ రెడ్డి చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రం కోలుకుంటోంది
- అంగన్వాడీలంతా అర్థం చేసుకోవాలన్న ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, మార్చి 1 (అనంత ప్రభ)

అనంతపురం ఈరోజు అంగన్వాడీలు గత కొన్ని రోజులుగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు తమ సమస్యలపై దీక్షలు చేస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. ప్రభుత్వం ఈ ఇరువై నెలల కాలంలో అంగన్వాడీలకు చేసిన మంచిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్‌గా పదోన్నతి కల్పించి, పూర్తి స్థాయి వేతనాలు అందించనుందన్నారు. అలాగే కొత్తగా ఐదు వెల మంది అంగన్వాడీ సహాయకులను నియమించనుందన్నారు. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాట్యుటీ కోసం బడ్జెట్‌లోనే రూ.ఇరువై కోట్లు కేటాయించి, అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే అంగన్వాడీలకు అండగా నిలిచిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల హాజరు డెబ్బై శాతం నుంచి 96 శాతానికి పెరగడం కూటమి పాలనకు వచ్చిన ప్రత్యక్ష ఫలితమే అన్నారు. 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్‌ఫోన్లు అందించిందన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు అందేలా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా కూటమి ప్రభుత్వం చెక్ పెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వం ఇంత మంచి చేసినప్పుడు మీ వేతనాలు, ఇతర వాటి విషయంలో ఎందుకు ఆలోచించదన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి మీ డిమాండ్లు తీసుకెళ్లామని.. మీకు న్యాయం చేసేందుకు ఆయన కూడా సానుకూలంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాళ తీసి వెళ్లిందన్నారు. వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు ఇంకా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి నేడు రాష్ట్రంలో ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్ని అధిగమించి.. ఉద్యోగులకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తోందన్నారు. ఇలాంటి సమయంలో అంగన్వాడీల డిమాండ్లను కూడా ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంటోందని.. ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.

## జెడి లక్ష్మీనారాయణ లక్ష సాధనలో ముందుకు వెళితే దేశ భవిష్యత్తు మారుతుంది వందేమాతరం ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పి. ఖాసీం



ఉరవకొండ, మార్చి 1 (అనంత ప్రభ)

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని "10వ తరగతి ఎందుకు? 10వ తరగతి తర్వాత ఏం చేయాలి?" అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తి జెడి లక్ష్మీనారాయణ గారు నాయకత్వం వహించారు.

ఈ సందర్భంగా వందేమాతరం ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పి. ఖాసీం మాట్లాడుతూ, జెడి గారు చేపట్టిన "లక్ష సాధన" కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో స్పష్టమైన లక్ష్య నిర్ధారణ పెంపొందుతుందని తెలిపారు. పిల్లలు చిన్న వయసులోనే తమ లక్ష్యాన్ని నిర్ణయించుకుని ఆ దిశగా కృషి చేస్తే వారి వ్యక్తిగత భవిష్యత్తు మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తు కూడా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.


10వ తరగతి విద్యార్థులకు ఉన్న అవకాశాలు, ఉన్నత విద్య మార్గాలు, పోటీ పరీక్షల ప్రాధాన్యత, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై విశదీకరించారు. ఈ తరహా అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యపై సరైన దిశానిర్దేశం ఇవ్వగలరని పేర్కొన్నారు.

జెడి లక్ష్మీనారాయణ గారు చేపట్టిన లక్ష సాధన కార్యక్రమం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని, ఇటువంటి కార్యక్రమాలు ఇంకా ఎక్కువగా నిర్వహించి యువతలో దేశభక్తి, బాధ్యతాయుత దృక్పథం పెంపొందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆమిద్యాలలో విషాదం -- అంధుడు పులి జుట్టు మారెప్ప మృతి

- పయ్యావుల సోదరుల ఆశీస్సులతో బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత
- మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ తమ్ముడు సూరి రూ.5,000 సహాయం
- మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం -- గ్రామస్తుల ప్రశంసలు
- పరామర్శించి అండగా ఉంటామన్న నాయకులు
- కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక నేతలు, కార్యకర్తలు




ఆమిద్యాల, మార్చి 1 (అనంత ప్రభ)

పయ్యావుల సోదరుల సహాయ సహకారాలతో ఆమిద్యాల గ్రామానికి చెందిన అంధుడు పులి జుట్టు మారెప్ప ఇటీవల మరణించగా, వారి కుటుంబానికి ఆర్థిక చేయూత అందించారు. పయ్యావుల శ్రీనివాసులు గారు, పయ్యావుల కేశవ్ గారి ఆశీస్సులతో మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ వారి తమ్ముడు సూరి రూ.5,000 నగదు సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నారాయణస్వామి, కొట్టం రామాంజనేయులు, పెద్దయిరి స్వామి, సుధాకర్, కొట్టం సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సహాయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అనంతలక్ష్మి కాలేజ్ చైర్మన్ అనంత రాముడు పుట్టినరోజు వేడుకలు



అనంతపురం, మార్చి 1 (అనంత ప్రభ)

అనంతలక్ష్మి కాలేజ్ చైర్మన్ అనంత రాముడు పుట్టినరోజు సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్టీయూ ఈసీ కృష్ణయ్య మరియు చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్, పూణే

ఎం. నరసింహప్ప గారు విచ్చేసి సభను శోభాయమానంగా తీర్చిదిద్దారు. వారు అనంత రాముడు.విద్యా సేవలను కొనియాడుతూ, సమాజాభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడగా, చైర్మన్ గారి సేవలను గుర్తుచేసుకుంటూ ప్రత్యేక సన్మానం కార్యక్రమం కూడా జరిగింది. అనంత రాముడు గారు విద్యార్థుల శ్రేయస్సు కోసం తన కట్టుబాటును పునరుద్ఘాటించారు.

చివరగా అందరూ కలిసి ఆయనకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన తొగట వీర క్షత్రియులు



యాడికి, మార్చి 1 (అనంత ప్రభ)

యాడికిలో శ్రీ లక్ష్మీ భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించనున్న కళ్యాణోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. యాడికిలోని సంత మార్కెట్‌లో ఉన్న శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయము తరపున ఈ పట్టు వస్త్రాలను సమర్పించారు. తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరి ఆలయం నుండి పట్టు వస్త్రాలను ఉడుముల లక్ష్మయ్య దంపతులు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా మేళతాళాల నడుమ పుర వీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ పూజారులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళవారం కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ వర్గాలు తెలిపారు.

## గరుడ వాహనంపై శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి



యాడికి, మార్చి 1 (అనంత ప్రభ)

శ్రీ శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు యాడికిలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన గరుడ సేవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గరుడ వాహనంపై అలంకృత రూపంలో స్వామివారు పురవీధుల గుండా విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పాలతో, విద్యుద్దీపాల కాంతులతో సుందరంగా అలంకరించిన గరుడ వాహనంపై ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవకు విశేష ప్రాముఖ్యత ఉందని, గరుడ సేవను దర్శించుకోవడం ద్వారా మహా పుణ్యఫలం లభిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు

## పిల్లల్ని అతిగా గారాభం చేయొద్దు

యాడికి, మార్చి 1 (అనంత ప్రభ)

తల్లిదండ్రుల ప్రేమే పిల్లల జీవితానికి పునాది. అయితే ఆ ప్రేమ అతిగా మారితే పిల్లల భవిష్యత్తుకు భారంగా మారే ప్రమాదం ఉందని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలను ప్రతి విషయంలో రక్షిస్తూ, కష్టమేమీ తెలియకుండా పెంచడం వల్ల వారు జీవితంలో ఎదురయ్యే సమస్యలను తట్టుకోలేని స్థితికి చేరుకుంటారని వారు సూచిస్తున్నారు. జీవితంలో సవాళ్లు, కష్టాలు, బాధ్యతలు అనేవి సహజమే. చిన్న వయసు నుంచే కష్టాలను ఎదుర్కొని, సమస్యలను పరిష్కరించే అలవాటుతో పెరిగిన పిల్లలు 25 ఏళ్ల వయస్సు వచ్చే నాటికి జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కొనే వ్యక్తులుగా మారతారని నిపుణులు చెబుతున్నారు. అటువంటి వారు భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులను సులభంగా పరిష్కరించగలుగుతారు. అయితే 20 ఏళ్ల వరకు ఎలాంటి కష్టం తెలియకుండా, ప్రతి సమస్యకు తల్లిదండ్రులే పరిష్కారం చూపేలా పెరిగిన పిల్లలు చిన్నపాటి సమస్య ఎదురైనా భయపడే పరిస్థితి ఏర్పడుతుందని నిపుణులు అంటున్నారు. అలాంటి వారు ఒత్తిడిని భరించలేక మానసికంగా బలహీనపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. కావున పిల్లలకు చిన్నప్పటి నుంచే బాధ్యతలు అప్పగించడం, తప్పులు చేయనివ్వడం, వాటి నుంచి నేర్చుకునే అవకాశం ఇవ్వడం అవసరమని సూచిస్తున్నారు. ప్రేమతో పాటు క్రమశిక్షణ, గారాభంతో పాటు మార్గనిర్దేశం ఉంటేనే పిల్లలు భవిష్యత్తుకు సిద్ధమవుతారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పిల్లలను కష్టాల నుంచి పూర్తిగా దూరంగా ఉంచడం కాదు, కష్టాలను ఎదుర్కొనేలా తీర్చిదిద్దడమే నిజమైన తల్లిదండ్రుల బాధ్యత అని వారు పేర్కొంటున్నారు

## పుట్టినరోజు వేడుక ను ఘనంగా జరుపుకున్న సహకార సంఘం చైర్మన్



కూడేరు, మార్చ్ 1 (అనంత ప్రభ)

కూడేరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల సహకార సంఘం అధ్యక్షులు ( చైర్మన్) రామగౌని జయప్రకాశ్ గౌడ్ ఆదివారం రోజున పుట్టినరోజు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

## చిట్యాల గ్రామంలో రాజశ్యామల హోమం ఘనంగా



పత్తికొండ, మార్చి 1 (అనంత ప్రభ)

పత్తికొండ నియోజకవర్గం పరిధిలోని కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామంలో ఉన్న శ్రీ ఆభయ ఆంజనేయస్వామి దేవాలయంలో రాజశ్యామల హోమం పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంజి స్వామి, ఆలయ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆది కృష్ణమ్మ, వైకుంఠం జ్యోతి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, సమయానికి వర్షాలు కురిసి రైతులు ఆనందంగా పంటలు పండించుకోవాలని దేవుని ప్రార్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ నాగరాజు, ఆలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రంగన్న నాయుడు, దేవనకొండ మండలం కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, సర్పంచ్ భాస్కర్ నాయుడు, గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ మధ్య కార్యక్రమం ఘనంగా సాగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది

## బ్రహ్మోత్సవాల సందర్భంగా కర్రసాము పోటీలు




యాడికి, ఫిబ్రవరి 28(అనంత ప్రభ )

శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జేసీ ఫ్యామిలీ, గ్రామ పెద్దలు మరియు భక్తాదుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కర్రసాము పోటీలు ఘనంగా నిర్వహించారు. ఉత్సాహభరితంగా జరిగిన ఈ పోటీల్లో శివకుమార్ విజేతగా నిలిచి తొలి బహుమతిని అందుకున్నారు. దాతలు, టీడీపీ నాయకులు వీరారెడ్డి పల్లి ఉప సర్పంచ్ జల్లా గంగిరెడ్డి రూ. 10,000 నగదు బహుమతిని ప్రదానం చేశారు. రెండవ స్థానంలో నిలిచిన నాగార్జునకు టీడీపీ నాయకులు కడ్డీల నాగేంద్ర మరియు ముత్యాలు రూ. 6,000 బహుమతిని అందజేశారు. మూడవ బహుమతిని శ్రీకర్ సాధించగా, జనసేన కార్యదర్శులు పప్పు వెంకటేష్ మరియు మధు ఆచారి కలిసి రూ. 4,000 నగదు ప్రదానం చేశారు. బహుమతులు అందించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువా, మెమెంటోతో సత్కరించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన యోగా గురువు గరిడి శివన్న, జనార్ధన్ నాయుడును ప్రత్యేకంగా సన్మానించారు. అదేవిధంగా 60 సంవత్సరాలు దాటినా యువకుల్లా కర్రసాము ప్రదర్శించిన ఎరుకల నారాయణ, వెంకటేష్, కమలపాడు గ్రామానికి చెందిన శేఖర్, రామన్నగుడిసెలకు చెందిన బాలరంగడులను కమిటీ సభ్యులు ఘనంగా అభినందించి సన్మానించారు.

## పిల్లల ప్రతిభకు వేదికైనా బ్రహ్మోత్సవాలు



యాడికి, మార్చి 1(అనంత ప్రభ )

యాడికిలోని శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం కళాకారుల నృత్య ప్రదర్శనలతో కళకళలాడింది. జెసి ఫ్యామిలీ, గ్రామ పెద్దలు, భక్తాదుల సమక్షంలో నిర్వహించిన డాన్స్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువతులు తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శిస్తూ ప్రేక్షకుల నుంచి కరతాళధ్వనులు అందుకున్నారు. పోటీలలో రాయలచెరువుకు చెందిన శ్రీ విద్య గ్రూప్ (శ్రీవిద్య స్కూల్) అద్భుత ప్రదర్శనతో ప్రథమ స్థానం దక్కించుకుంది. టీడీపీ సీనియర్ నాయకులు గొర్తి రుద్రమ నాయుడు రూ. 10,000 నగదు బహుమతిని అందజేశారు. స్టార్ పారడైజ్ యాజమాన్యం విజేతలకు విన్నర్ కప్‌ను ప్రదానం చేసి అభినందించింది. ద్వితీయ స్థానాన్ని సాయి అంకిత గ్రూప్ (విజన్ స్కూల్) కైవసం చేసుకుంది. టీడీపీ సీనియర్ నాయకులు రూపునేని రాజశేఖర్ నాయుడు రూ. 5,000 నగదు బహుమతిని అందజేశారు. వీరికి రన్నర్ కప్‌ను స్టార్ పారడైజ్ యాజమాన్యం అందించింది. తృతీయ స్థానాన్ని శ్రావ్య గ్రూప్ (వాగ్దేవి స్కూల్) సాధించింది. జనసేన నాయకులు కేశవ రూ. 2,500 నగదు బహుమతిని అందజేశారు. బహుమతులు అందించిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు, స్మారక చిహ్నాలతో ఘనంగా సత్కరించారు. పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన డాన్స్ మాస్టర్ రమ్యకృష్ణను జనసేన ఉపాధ్యక్షులు జాకిర్ ప్రత్యేకంగా సన్మానించారు. పిల్లలలోని కళాత్మక ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించే ఈ కార్యక్రమం గ్రామంలో సాంస్కృతిక ఉత్సాహాన్ని పెంపొందించిందని ప్రజలు అభిప్రాయపడ్డారు

## జాతి కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ... ఘనంగా నివాళులు



శింగనమల, మార్చి 1 (అనంత ప్రభ)

ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం మూడు దశాబ్దాల పాటు కొనసాగిన సామాజిక ఉద్యమంలో జాతి కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ... ఘనంగా నివాళులర్పించారు

సింగనమల మండల కేంద్రంలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం మూడు దశాబ్దాల పాటు కొనసాగిన సామాజిక ఉద్యమంలో జాతి కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ... ఘనంగా నివాళులర్పించారుమాదిగ అమరవీరులకు జోహార్లు పద్మశ్రీ మందకృష్ణ పద్మశ్రీ మందకృష్ణ

ఎం బి ఎఫ్ తాలూక కార్యదర్శి కరెంట్ నల్లప్ప కోశాధికారి డాక్టర్ రాము మండల అధ్యక్షుడు మురళి తప్పిడి కళాకారుడు జిల్లా అధ్యక్షుడు సాలప్ప జలాల్పురం నాగరాజు

మాదిగ ఆదేశాలు మేరకు సింగనమల మండలం నివాళులర్పించాం మండల అధ్యక్షుడు రామాంజనేయులు ఉపాధ్యక్షుడు సురేష్ కోశాధికారి పవన్ కుమార్ తప్పిడి కళాకారుడు జిల్లా అధ్యక్షుడు జలాలపురం రాజు మాదిగ ఎంఎస్పి చిన్న జలాలపురం ఓబులేసు హరికృష్ణ కృషి రాహుల్ బన్నీ అశోక్ సాయి సింగనమల మండలం ప్రతి కార్యకర్త ఎస్సీ కాలనీలో పిల్లలందరూ జాతి కోసం ప్రాణాలు అర్పించిన జోహార్ మాదిగ జోహార్

## చిన్నారి పునర్వికకు అండగా మంత్రి నారా లోకేష్ --- రూ.6 కోట్ల సాయం ప్రకటింపు: గడ్డా ఫక్రుద్దీన్ ప్రశంసలు



ఆదోని, మార్చి 1 (అనంత ప్రభ)

కర్నూలు జిల్లాకు చెందిన జయం సురేష్ కుమార్--దీపావతి దంపతుల కుమార్తె చిన్నారి పునర్వికకు అరుదైన ఎస్ ఎం ఏ టైప్-1 జన్యు వ్యాధి సోకిన నేపథ్యంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన సహాయం అభినందనీయమని టీడీపీ ఏపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్ తెలిపారు. శనివారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు.

చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన అత్యంత ఖరీదైన ఇంజక్షన్ కోసం సుమారు ₹16 కోట్లు అవసరమవగా, ప్రజలు మరియు దాతల సహకారంతో ఇప్పటికే ₹10 కోట్లు సమీకరించబడినట్లు తెలిపారు. మిగిలిన ₹6 కోట్లు మంత్రి నారా లోకేష్ సమకూర్చుతామని ప్రకటించడం మానవత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియాలో లక్షలాది మంది పునర్విక ఆరోగ్యం కోసం మద్దతుగా నిలిచి నిధులు సేకరించడం విశేషమని, విరాళాలు అందించిన ప్రతి ఒక్కరికీ మంత్రి ధన్యవాదాలు తెలియజేశారని చెప్పారు. చిన్నారి పూర్తి ఆరోగ్యవంతురాలిగా మారేందుకు అవసరమైన చికిత్సకు సహకరించాలని తన సిబ్బందికి మంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా స్పందించే నాయకుడిగా నారా లోకేష్ నిలుస్తున్నారని, మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి పునర్విక కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయం అని గడ్డా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల తరఫున మంత్రి తీసుకున్న ఈ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు

## ఆదోని పట్టణంలో అక్రమ సారా స్థావరాలపై పోలీసుల మెగా దాడి 1800 లీటర్ల జాగ్గరీ వాష్ ధ్వంసం



ఆదోని, మార్చి 1 (అనంత ప్రభ)

ఈ రోజు సీఐ , ఎస్ఐ సిబ్బంది మరియు స్పెషల్ పార్టీ సంయుక్తంగా రణమండల కొండల వెనుక వైపు ఉన్న అక్రమ ఐడీ సారా తయారీ స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా జాగ్గరీ వాష్ నిల్వలను గుర్తించి పూర్తిగా ధ్వంసం చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం, నాలుగు వేర్వేరు ప్రదేశాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన జాగ్గరీ వాష్ 08 డ్రమ్ములు, 20 మట్టి పాత్రలు స్వాధీనం చేసుకుని మొత్తం సుమారు 1800 లీటర్ల వాష్‌ను అక్కడికక్కడే నాశనం చేశారు. ఈ అక్రమ సారా తయారీ కార్యకలాపాలు ప్రజల ఆరోగ్యానికి, శాంతి భద్రతలకు ముప్పుగా మారుతున్న నేపథ్యంలో పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి, పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ, ఆదోని 1 టౌన్ పోలీస్ స్టేషన్ వెల్లడించారు. అక్రమ సారా తయారీ, రవాణా, విక్రయాలపై ఇకపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించారు.

అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితల్లోనూ ఉపేక్షించబోమని పోలీసుల ఘాటైన హెచ్చరిక.

## అంతర్జాతీయ మహిళ దినోత్సవ ర్యాలీ లో పాల్గొన్న సర్పంచ్ మోనాలిసా




వజ్రకరూరు, మార్చి 1 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండల కేంద్రంలోని ఆదివారం రోజున అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హోంశాఖ ఆదేశాలతో ఎస్సై నాగస్వామి అధ్యక్షతన మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ మహిళా దినోత్సవ ర్యాలీకి వజ్రకరూరు స్థానిక సర్పంచ్ మోనాలిసా సంఘీభావం తెలిపగా ఆమె వెంట మహిళలు, గ్రామ ప్రజలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహణ



ఆత్మకూరు, మార్చ్ 1 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని పంపునూరు గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం రోజున స్వామి వారికి పాలాభిషేకం పంచామృత అభిషేకం అలంకరణ,ఆకుపూజ ,అర్చన మహానైవేద్యం , మహామంగళహారతి, పల్లకి సేవ మరియు కుజదోష కాలసర్పదోష సర్పదోష నివారణ కొరకు "శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల మంత్ర బీజాక్షర హోమము"నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి బి బాబు, ఆలయ ట్రస్ట్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్వామివారి అభిషేకం మరియు హోమము నందు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాల్గొనడమైనది

## ప్రజా దర్బార్ లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



శింగనమల, మార్చి 1 (అనంత ప్రభ)

అనంతపురం నగరంలోని శింగనమల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ లో నియోజకవర్గ ప్రజల నుండి సమస్యలు పై పలు వినతులు ను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్వీకరించారు. ప్రజలిచ్చిన వినతులు ను పరిశీలించి, వీలైనంత తొందరగా పరిష్కరించాల్సినదిగా సంబంధించిన అధికారులు కు సూచిస్తూ ఆదేశించారు. ఆర్థికేతర విషయాల పట్ల నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా పేర్కొన్నారు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



శింగనమల, మార్చి 1 (అనంత ప్రభ)

సింగనమల మండలం చిన్న జలాపురం గ్రామానికి చెందిన అనిల్ కుమార్ కు 116158 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర్


## గరుడ వాహన సేవలో శ్రీ మలహోబిల లక్ష్మీ నరసింహస్వామి



ఆత్మకూరు, మార్చి 1 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం పరిధిలోని పంపునారు కొండపై వెలసినటువంటి శ్రీ మలహోబిల శ్రీ లక్ష్మీనరసింహస్వామి వై. కొత్తపల్లి గ్రామంలో నందు ఆదివారం రోజున శ్రీ లక్ష్మీనరసింహస్వామి గరుడ వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పల్లకి సేవలో ఆలయ కార్య నిర్వహణ అధికారి దేవదాస్ సిబ్బంది పాల్గొన్నారు

## శ్రీ శ్రీ గుండు నాగప్ప స్వామికి (నాగదేవత)విశేష పూజలు



కూడేరు, మార్చి 1 (అనంత ప్రభ)

కూడేరు మండలం పరిధిలోని కొర్రకోడు, చోళ సముద్రం గ్రామాల మధ్య వెలసిన శ్రీ గుండు నాగప్ప స్వామి నాగదేవతకు ఆదివారం రోజున విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తుల పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ సన్నిధిలో తీర్థ,అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు

AP 4PG 02 - 3- 2026 MONDAY qxp_Layout 1 02-03-2026 07:16 AM Page 3



# చిన్నారుల ప్రాణాలతో ఆటలు నిర్లక్ష్యానికి నిదర్శనం!

## పెద్ద తుమ్మలం పాఠశాల వద్ద తెరిచి ఉన్న నీటి వాలు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది

ఆదోని, మార్చి 1 (అనంత ప్రభ)

ఆదోని మండలం పెద్ద తుమ్మలం గ్రామంలో అధికారుల నిర్లక్ష్యం చిన్నారుల ప్రాణాలకు ముప్పుగా మారింది. ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న అంగన్వాడి కేంద్రానికి తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన నీటి వాలను మూసివే-యకుండా అలాగే వదిలేయడంతో అక్కడ చదువుతున్న చిన్నారులు తీవ్రమైన ప్రమాదంలో పడుతున్నారు.



పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రంలో మాటలు సరిగా రాని టాడ్లర్లు, చిన్న పిల్లలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుండగా, ఆ వాలు చుట్టూ రక్షణ కంచె లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పిల్లలు ఆడుకుంటూ వెళ్లి లోపలికి తొంగి చూడటం, జారి పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడం పట్ల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

వాలు మూత లేకపోవడంతో కొంతమంది పిల్లలు అక్కడ చెత్త వేయడం, మలమూత్ర విసర్జన చేయడం వల్ల అది మరింత ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. ప్రమాదం జరిగాకే అధికారులు స్పందిస్తారా? చిన్నారుల ప్రాణాలకు విలువ లేదా? అని వారు ప్రశ్నిస్తున్నారు.

పాఠశాల యాజమాన్యం, గ్రామ అధికారులు, తాగునీటి సరఫరా శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆ వాలను పక్కాగా మూసివేసి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఎప్పుడైనా విషాదం సంభవించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

చిన్నారుల ప్రాణాలు ప్రమాదంలో పడకముందే చర్యలు తీసుకుంటారా? లేక ఘటన తర్వాత మేల్కొంటారా? అంటూ తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# సామాన్యులకు నీటి కనెక్షన్ దక్కదా? -- కల్లుబవిలో ప్రజల ఆవేదన

ఆదోని, మార్చి 1 (అనంత ప్రభ)

కల్లుబవి ప్రాంతంలో సంవత్సరాలు గడిచినా తాగునీటి కనెక్షన్లు ఇవ్వడానికి అధికారులు ముందుకు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న దాదాపు 20 సామాన్య కుటుంబాల సమస్యలను పట్టించుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు.

ప్రభావశీలులు నివసించే ప్రాంతాల్లో నాయకుల సూచనతో అధికారులు, కాంట్రాక్టర్లు వెంటనే పనులు పూర్తి చేస్తుండగా, కల్లుబవిలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని అంటున్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో నాలుగేళ్ల క్రితం అమృత పథకం కింద పైప్‌లైన్ వేసినా ఇప్పటివరకు ఒక్క ఇంటికీ నీటి కనెక్షన్ ఇవ్వలేదని ప్రజలు వాపోతున్నారు. కనెక్షన్ కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా ఫలితం లేకపోయిందని తెలిపారు.



వాటర్ లైన్‌మన్ ఐదు రోజులకు ఒకసారి నీరు వదలాల్సి ఉన్నప్పటికీ తనకు అనుకూలమైన సమయాల్లో మాత్రమే నీరు వదులుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే "పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి", "కరెంటు లేదు" వంటి కారణాలు చెబుతున్నారని పేర్కొన్నారు.

ఇటీవల పైప్‌లైన్ పనుల పేరుతో సీసీ రోడ్డును తవ్వి దెబ్బతీశారని, మూడు రోజులు గడిచినా మరమ్మతులు చేపట్టలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, రైతులు పొలాలకు వెళ్లడానికీ, కూలీలు పనులకు వెళ్లడానికీ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

"తాగునీటి వంటి మౌలిక హక్కులో కూడా తారతమ్యం చూపుతున్నారా?" అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఎస్సీ కాలనీలో నీటి కనెక్షన్లు కల్పించడంతో పాటు దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలని, అలాగే నీటి సరఫరా సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు










# డయాబెటిస్ ఉందా? అయితే పచ్చి మామిడిని తినడం ప్రారంభించండి



వేసవి వచ్చిందంటే మార్కెట్లో మామిడికాయలు, మామిడి పండ్లు సందడి చేస్తాయి. భారతదేశంలో ప్రజలు అత్యంతగా ఇష్టపడే పండ్లలో మామిడి పండ్లు కూడా ఒకటి. దీనిలో విటమిన్లు, మినరల్స్ డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఆరోగ్యానికి చాలా మంచిది. మండుతున్న వేసవి తాపాన్ని తట్టుకోవడానికి ఈ పోషకాలన్నీ అవసరం. ఎక్కువ మంది మామిడి పండ్లను తినడానికి ఆసక్తి చూపిస్తారు కానీ, పచ్చి మామిడికాయను తినడానికి ఇష్టపడరు. కానీ పచ్చిమామిడిని తినడం కూడా చాలా అవసరం. ఇది శరీరానికి శీతలీకరణాన్ని అందిస్తుంది. వేడి నుంచి తట్టుకునే శక్తిని ఇస్తుంది. దీనిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో ముందుంటుంది. వేసవిలో వచ్చే వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడడానికి శరీరానికి శక్తిని ఇస్తుంది. పచ్చి మామిడికాయలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు పెరుగుతామనే భయం అవసరం లేదు.

డయాబెటిస్ ఉంటే...

మధుమేహంతో బాధపడే రోగులు సీజనల్‌గా దొరికే పచ్చి మామిడికాయల్ని తినడం చాలా అవసరం. దీన్ని తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా డయాబెటిస్ రోగం అదుపులో ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలోనూ, తగ్గించడంలోనూ పచ్చి మామిడికాయ చాలా సహకరిస్తాయి. కాబట్టి వేసవిలో ప్రతిరోజూ పచ్చిమామిడి ముక్కలను తినడం అవసరం.

పచ్చిమామిడి కాయలు తినడం వల్ల మనకు కావాల్సిన రోజువారి విటమిన్ %సూ%లో 10 శాతం ఇది అందిస్తుంది. ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు ఇది చాలా అవసరం. దీనిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. మామిడిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉంటాయి. ఇది రక్తప్రసరణ సవ్యంగా జరగడానికి అవసరం. రక్తప్రసరణ సవ్యంగా జరగడం వల్ల గుండె ఆరోగ్యం బాగుంటుంది. ఈ పోషకాలు రక్తనాళాలు విశ్రాంతి తీసుకోవడానికి కూడా సహాయపడతాయి. అధిక రక్తపోటు రాకుండా అడ్డుకుంటాయి. తక్కువ రక్తపోటు ఉండటం వల్ల గుండెకు మంచిది. ఈ పచ్చి మామిడికాయలో మాంగిఫెరిన్ అని యాక్సిడెంట్ ఉంటుంది. ఇది గుండెకు ఎంతో మేలు చేస్తుంది.

పచ్చి మామిడికాయలో ఒత్తిడిని తగ్గించే పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. పచ్చి మామిడికాయ తినడం వల్ల లుకేమియా, పెద్ద పేగు, ఊపిరితిత్తులు, ప్రొస్టేట్, రొమ్ము వంటి క్యాన్సర్లు రాకుండా ఇది అడ్డుకుంటుంది. పచ్చి మామిడి కాయని ఈ రోజు నుంచే తినడం అలవాటు చేసుకోండి.

# వేసవిలో ఎటువంటి రోగాన్నైనా తగ్గించే అద్భుతమైన హోమ్ రెమిడీస్‌చూడండి

వేసవిలో శరీరం అనేక సవాళ్ళని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉష్ణోగ్రత, డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్ వంటి అనేక రకాల సమస్యలకు దారితీస్తుంది. వడదెబ్బ, వేడి దద్దుర్లు సాధారణ సమస్యలు. వీటికి తోడు శ్వాసకోశ సమస్యలు తీవ్రమవుతాయి. వేసవి కారణంగా చెమట రూపంలో సోడియం, పొటాషియం వంటి అవసరమైన పోషకాలు క్షీణించిపోతాయి. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి హైడ్రేట్ గా ఉండటం, కాటన్ వస్త్రాలు ధరించడం, పీక్ అవర్స్ లో ఎండకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఎక్కువ మంది ఈ టైమ్ లో జీర్ణక్రియ, చర్మం సమస్యలు, కాలానుగుణ ఫ్లూ, ఇన్ఫెక్షన్స్ బారిన పడుతూ ఉంటారు. వాటిని ఎదుర్కోవాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలి. అటువంటి సమస్యలను పరిష్కరించగలిగే వంటింటి చిట్కాలు మీ కోసం..

అసిడిటీ కోసం లవంగం

అసిడిటీ సమస్య ఉన్నప్పుడల్లా ఒక లవంగం ముక్కని తీసుకుని చప్పరించండి. లవంగంలో ఉండే సహజ నూనె వల్ల అసిడిటీ సమస్యని తగ్గించడంలో సహాయపడుతుంది.

దగ్గు తగ్గించేందుకు ఖర్జూరాలు

పొడి దగ్గుతో బాధపడుతుంటే మీరు రెమిడీని ప్రయత్నించవచ్చు. 6 ఖర్జూరాలు తీసుకుని అర లీటరు పాలలో 25 నిమిషాల పాటు తక్కువ మంట మీద మరిగించాలి. పాలు బాగా మరిగిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకుని చల్లారనివ్వాలి. ఈ మిశ్రమాన్ని రోజుకి కనీసం మూడు సార్లు తీసుకుంటే మంచిది.

మైగ్రేన్ కోసం యాపిల్

రోజుకొక యాపిల్ తింటే డాక్టర్ కి దూరంగా ఉండవచ్చని అందరూ చెప్తుంటారు. మైగ్రేన్ నొప్పిని తగ్గించడంలో యాపిల్ సహాయపడుతుంది. అయితే దీన్ని ఖాళీ కడుపుతో మాత్రమే తినాలి.

మొటిమలు తగ్గించే దోసకాయ

దోసకాయలో నీరు సమృద్ధిగా ఉంటుంది. ఖనిజాలు, విటమిన్లతో లోడ్ చేయబడి ఉంటాయి. ఇది చర్మానికి మేలు చేస్తుంది. తురిమిన దోసకాయని మెడ, మొహం, కళ్ళపై అప్లై చేసుకోవచ్చు. ఇది మొటిమలు, బ్లాక్ హెడ్స్ ని తొలగించడంలో సహాయపడుతుంది.

దగ్గుకి తులసి

అధిక వేడి కారణంగా చాలా మందికి వేసవిలో వేడి జలుబు చేస్తుంది. దీన్ని తగ్గించుకునేందుకు తులసి చక్కని హోమ్ రెమిడీ. వెల్లుల్లి రసం, తేనె సమాన పరిమాణంలో తీసుకుని అందులో తులసి రసాన్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజుకి మూడు సార్లు తీసుకుంటే దగ్గుని తగ్గిస్తుంది.

అల్సర్ కి తులసి ఆకులు

తులసిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేదంలో ఎన్నో సంవత్సరాలుగా ఉపయోగిస్తున్నారు. ఇందులో యాంటాసిడ్ గుణాలు ఉన్నాయి. రోజుకి కొన్ని తులసి ఆకులు నమిలి మింగితే మంచిది. గ్యాస్ ఉబ్బరం, కడుపులో మంట, అల్సర్లు ఏర్పడకుండా నిరోధించేందుకు సహాయపడుతుంది. ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడంలో దోహదపడుతుంది.



# తేనెలో ఇవి కలిపి రాస్తే నల్ల మచ్చలు మాయం అవుతాయ్..!



తేనెలో అందరికీ అందుబాటులో ఉండేదే. దీనిలో ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. తేనెలో క్యాల్షియం, ఐరన్, సోడియం, ఫాస్ఫరస్, సల్ఫర్, పొటాషియం, విటమిన్ సి, బి వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. తేనె ఆరోగ్యాన్ని రక్షించడానికే కాదు.. సౌందర్య సంరక్షణకు సహాయపడుతుంది. తేనెలోని యాంటీఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు.. చర్మ సంరక్షణకు మేలు చేస్తాయి. సూర్యరశ్మి, హార్మోన్ల మార్పుల, వృద్ధాప్యం కారణంగా.. చాలా మంది మహిళలు డార్క్ స్పాట్స్‌తో బాధపడుతుంటూ ఉంటారు. తేనె నల్ల మచ్చలను తేలికపరచి.. చర్మం రంగుతో సమం చేయడానికి సహాయపడుతుంది. మీరు నల్ల మచ్చలతో బాధపడుతుంటే.. ఈ ఐదు ఫేస్ మాస్క్ మీకు సహాయపడతాయి.

తేనె, నిమ్మరసం ఫేస్ మాస్క్..

ని మ్మరసం వంటి నేచరల్ స్కిన్ లైట్నర్స్ చర్మంపై డార్క్ స్పాట్స్‌ను తగ్గించడంలో సహాయపడుంది. ఈ ఫేస్ మాస్క్‌ను తయారు చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ ఫ్రెష్ లెమన్ జ్యూస్ మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసిన తర్వాత.. 15 నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత గోరువెచ్చని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే.. మంచి రిజల్ట్స్ ఉంటాయి.

తేనె, పసుపు ఫేస్ మాస్క్..

పసుపులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలు మంటను తగ్గిస్తాయి, చర్మ సమస్యలను నయం చేస్తాయి. ఈ ఫేస్ మాస్క్ చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనెకు చిటికెడు పసుపు పొడి కలిపి మిశ్రమాన్ని తయారు చేయండి. ఆ తర్వాత ముఖానికి అప్లై చేసి.. 10 – 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వత గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. ముఖంపై నల్లటి మచ్చలు తొలగుతాయి.

తేనె, దాల్చిన చెక్క ఫేస్ మాస్క్..

దాల్చినచెక్కలో యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉంటాయి. మొటిమలతో బాధపడేవారికి దాల్చిన మంచి మెడిసిన్ అనొచ్చు. అంతేకాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరచి.. డార్క్ స్పాట్స్‌ను తగ్గిస్తుంది. ఈ ఫేస్ మాస్క్ తయార చేయడానికి ఒక టేబుల్ స్పూన్ తేనెలో చిటికెడు దాల్చిన చెక్క పొడి వేసి.. మిక్స్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసి 10 నుంచి 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. మంచి రిజలట్స్ కోసం వారానికి రెండు సార్లు అప్లై చేయండి.


తేనె, బొప్పాయి ఫేస్ మాస్క్..

బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి, డార్క్ స్పాట్స్ రూపాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. పండిన బొప్పాయి గుజ్జు ఒక టేబుల్ స్పూన్ తీసుకుని, దానిలో తేనె కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేసుకోండి. ఈ మిశ్మాన్ని ముఖానికి అప్లై చేసి.. 15 – 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. మంచి రిజల్ట్స్ కోసం.. వారానికి ఒక సారి ఈ మాస్క్ అప్లై చేసుకోండి.

తేనె, కలబంద ఫేస్ మాస్క్..

కలబందలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు డార్క్ స్పాట్స్‌తో సంబంధం ఉన్న ఎరుపు, మంటను తగ్గిస్తాయి. దీనిలో చర్మానికి పోషణ ఇచ్చే.. విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఒక టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ కలబంద గుజ్జు మిక్స్ చేసి పేస్ట్‌లా చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి.. 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. డార్క్ స్పాట్స్ మాయం అవుతాయి.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..


ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యురిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు. పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

దేవీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాంతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com